జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

జిల్లా కబడ్డీ జట్టు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 2: ఆదిలాబాద్‌లో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోల్గొనే జిల్లా జట్టును ఆదివారం నేరేడుచర్లలో ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అడ్‌హక్ కమిటీ చైర్మన్ కర్తవ్య తెలిపారు. నేరేడుచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలో 50 మంది క్రీడాకారులు పాల్గొనగా వారి నుంచి జట్టును ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కాగా, ఎంపికైన జట్టు సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు అల్లం ప్రభాకర్ రెడ్డి, అడ్‌హక్ కమిటీ సభ్యులు సైదులు, రాంచందర్‌రావు, నర్సింహారావు, శ్రీనివాసరెడ్డి, కలీం పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌కు సన్మానం

నాగేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

మఠంపల్లి, ఫిబ్రవరి 2: హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా జక్కుల నాగేశ్వరరావు 5 సంవత్సరాల పదవీ కాలం ముగిసిన సందర్భంగా మండలంలోని పెదవీడు మాజీ ఎంపీటీసీ కుందూరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగరాజు యాదవ్, నబీ, నాగరాజు, వీరస్వామి, నవీన్, నరసింహారావు, వీరలింగం తదితరులు పాల్గొన్నారు.

'వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు'

సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగయ్య

నేరేడుచర్ల, ఫిబ్రవరి 2: నేరేడుచర్లలోని టౌన్‌హాల్‌లో ఆదివారం వాసవీ క్లబ్ ఆఫీస్ బేరర్ల ట్రైనింగ్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దొంతు పాండురంగయ్య మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా 2 వేల వాసవీ క్లబ్బులతో రూ.100 కోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆరు రకాల సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్దేశించినట్లు వెల్లడించారు. బాలికలకు సుమారు వెయ్యి సైకిళ్ల పంపిణీ, 2 లక్షల నోటు పుస్తకాల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి వెంపటి శబరినాథ్, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు రుద్రంగి రవి, వైస్ గవర్నర్లు బి.వెంకటేశ్వర్లు, టి.రాము, వి.సతీశ్, విజయలక్ష్మి, విద్యాసాగర్, జి.అరుణకుమారి, కె.శ్రీనివాసరావు, సుమంత్, ఎం.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ కోసం యుద్ధానికైనా సిద్ధం'

సమావేశంలో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 2: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వానిపై యుద్ధానికైనా సిద్ధమని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ అన్నారు. టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రావణ్‌కుమార్ మాదిగ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు-వేల గొంతుకల' సభకు టీఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ప్రతి మాదిగ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వల్దాస్ శంకర్, పట్టణ అధ్యక్షుడు పిడమర్తి మధు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మీసాల శివరామకృష్ణ, యడవెల్లి రాము, బొల్లె అశోక్, సూరారపు నాగయ్య, కొండేటి సందీప్, బి. రఘు, ఎన్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పుల' సభను విజయవంతం చేయాలి

నూతనకల్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నూతనకల్, ఫిబ్రవరి 2: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం హైదరాబాద్‌లో ఈ నెల 7వ తేదీన మందకృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించనున్న లక్ష డప్పులు-వేల గొంతుకల సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్లాయి పరుశురాములు, మండలాధ్యక్షుడు గంగాదరి, లక్ష్మణ్, రవిశంకర్, దయాకర్, యశోద, విజయలక్ష్మి, మహేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద లక్ష డప్పులు-వేల గొంతుకల సభ పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు తిప్పర్తి గంగరాజు, మిర్యాల చిన్ని, పి.ఉమేశ్, యడవెల్లి కార్తీక్, పి.వెంకటేశ్, పి.రమేశ్, ఎం.కిరణ్, బి. మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'అరుణోదయ' విలీన సభను జయప్రదం చేయాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అరుణోదయ నాయకులు

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 2: సూర్యాపేటలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న రెండు అరుణోదయ సంస్థల విలీన సభను జయప్రదం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు సామ నర్సిరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని పాత సూర్యాపేట గ్రామంలో విలీన సభ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అరుణోదయ సంస్థ 2013లో రెండుగా చీలిపోయిందని తెలిపారు. విలీన సభకు కవులు, కళాకారులు, యువత పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సూరారపు మమత, మరియమ్మ, తలకొప్పుల ఎల్లమ్మ, ఎడవల్లి మంగమ్మ, చెరుకుపల్లి రేణుక, యడవెల్లి యశోద, జ్యోతి, బాస్కు అనిల్, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతరలో వస్తు విక్రయాలకు ముగిసిన వేలం

వేలం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

చివ్వెంల, ఫిబ్రవరి 2: మండల పరిధి వల్లభాపురం ఆవాసం జగన్‌నాయక్ తండాలోని ఏచర్ల ముత్యాలమ్మ ఆలయం వద్ద ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జాతర జరుగనుంది. ఈ జాతరలో వివిధ రకాల వస్తువుల విక్రయాలకు ఆదివారం వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరికాయల అమ్మకం హక్కును సూర్యాపేటకు చెందిన వరికల్లు శ్రీను రూ.70 వేలకు దక్కించుకోగా, తలనీలాల సేకరణను సూర్యాపేటకు చెందిన సుంకరి లక్ష్మీనారాయణ రూ.28 వేలకు పొందారు. లడ్డూ, పులిహోర, మిఠాయి అమ్మకాలను రూ.47 వేలకు యాట నాగరాజు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బానోత్ నాగార్జున నాయక్, గౌరవాధ్యక్షుడు మొగదాల లక్ష్మణ్‌గౌడ్, సింగారపు కోటయ్య, తేజావత్ బాలాజీ, సింగారపు సైదులు, మర్రి పడగ సైదులు, మాద గురువమ్మ, వెంకటి, పల్లేటి సైదులు, రామకృష్ణ, లింగయ్య, దేవా, ఊశయ్య, జయరాజ్ పాల్గొన్నారు.

పెద్దగట్టుపై వైభవంగా దిష్టిపూజ మహోత్సవం

- ఓ లింగా నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

దేవరపెట్టె వద్ద పూజలు చేస్తున్న ఆలయ డైరెక్టర్లు తదితరులు

చివ్వెంల/సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 2: పెద్దగట్టుపై ఆదివారం రాత్రి దిష్టిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతరకు పదిహేను రోజుల ముందు నిర్వహించే దిష్టిపూజలో భాగంగా ముందుగా దేవరపెట్టెను మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం నుంచి సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి శనివారం రాత్రి చేర్చారు. కేసారం గ్రామంలో మెంతబోయిన వారు, మున్న వారు, గొర్ల వారు, బైకాని వారు దేవరపెట్టెలోని దేవతామూర్తులైన లింగమంతులస్వామి, గంగమ్మ, ఆకు మంచమ్మ, యలమంచమ్మ, చౌడమ్మల బొమ్మలను గుడ్డతో తుడిచి పసుపు, కుంకుమలతో బొట్టు పెట్టారు. కొబ్బరికాయలు కొట్టి పరమాన్నం నైవేద్యంగా సమర్పించి దేవరపెట్టెను పెద్దగట్టుకు చేర్చారు.

పూజా కార్యక్రమం..

పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆలయ ప్రాంగణంలో గల మండపంలో లింగమంతుల స్వామి, చౌడమ్మ ఆలయాలకు ఎదురుగా పసుపుతో రాసిన చంద్రపట్టంలో దేవరపెట్టెను ఉంచారు. అనంతరం పూజా కార్యక్రమాలు చేపట్టారు. సంప్రదాయం ప్రకారం కేసారం గ్రామానికి చెందిన మెంతబోయిన వంశస్తులు, గుంపుల తిరుమలగిరి గ్రామానికి చెందిన మున్న వంశస్తులు తమ వెంట తెచ్చిన కొత్త మట్టి కుండల్లో బియ్యం, పసుపు వేసి బోనం వండారు. మున్న వంశస్తులు వండిన బోనాన్ని లింగమంతుల స్వామికి, మెంతబోయిన వంశస్తులు వండిన బోనాన్ని చౌడమ్మ తల్లికి రెండు కుంభాలుగా (రాసులుగా) పోశారు. రాసిలోని అన్నం ముద్దను కొద్దిగా తీసుకొని దీపారాధన చేసేందుకు దీపంత (కంచుడు) తయారు చేసి దానిలో నెయ్యి పోసి దీపం వెలిగించి రాసిపై పెట్టి దేవతలకు మొక్కారు. ఈ సందర్భంగా బైకాన్లు ముందస్తుగా మెంతబోయిన, గొర్ల, మున్న వంశస్తులకు బొట్టు పెట్టి కంకణాలు కట్టారు. రెండు రాసుల నుంచి తీసిన అన్నంలో పెరుగును కలిపి ప్రసాదంగా చేసి హక్కుదారులైన యాదవ వంశస్తులకు పంచారు. అనంతరం చౌడమ్మ తల్లికి మొక్కు చెల్లించి బలిముద్దను చల్లడంతో దిష్టిపూజ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కుశలయ్య, పెద్దగట్టు చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, చివ్వెంల తాసీల్దార్ కృష్ణయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు గొర్ల గన్నారెడ్డి, మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్న మల్లయ్య, సూర్యాపేట మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి'

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడ రూరల్/కోదాడ టౌన్, ఫిబ్రవరి 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు చింతా బాబుమాదిగ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఆదివారం కోదాడలోని అంబేద్కర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జగరనున్న లక్ష డప్పులు-వేల గొంతుకల సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న నాయకత్వంలో వర్గీకరణ సాధనకు మందకృష్ణ మాదిగకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. సభకు ప్రతి మాదిగ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణాల అబ్రహం, ఏర్పుల చిన్నమాదిగ, పిడమర్తి బాబురావు, కందుకూరి నాగేశ్వరరావు, బల్లె పంగు స్వామి, చిన్నవెంకయ్య, సంజీవరావు, శ్రీను, లింగారావు, కల్యాణ్, వెంకటేశ్వర్లు, శ్రావణ్ పాల్గొన్నారు.

'క్రీడలతో మానసికోల్లాసం'

విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

కోదాడ రూరల్, ఫిబ్రవరి 2: క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయని మాజీ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఎండీ.మహబూబ్‌జాని, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్‌కే.బషీర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎస్‌కే.నయీం అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో లెజెండ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్లకు నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్, ఖాజాభాయ్, ఎస్‌కే.మదార్, షాబుద్దీన్, షఫీ, ఎస్‌కే.బాగ్దద్, దస్తగిరి, పంది తిరుపతయ్య, గంధం పాండు తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్'

నిరసన తెలుపుతున్న నాయకులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు విమర్శించారు. బడ్జెట్‌ను నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కార్మికులు, రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల నాయకులు సైదులు, వెంకటేశ్వర్లు, నరసింహారావు, సామేలు, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వులో ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్‌సింగ్

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 2: స్థానిక మైహోం సిమెంట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మేళ్లచెర్వులోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఖమ్మంలోని వినాయక సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యూరో, జనరల్, ఎముకలు, కీళ్లు, చిన్నపిల్లల వైద్యులతో 483 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మైన్స్ డీజీఎం అప్పలరాజు, ఏజీఎంలు నరేశ్, శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ శ్రీను పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని విస్మరించిన కేంద్రం'

సమావేశంలో మాట్లాడుతున్న చందర్‌రావు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించిందని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు చందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి అరకొర నిధులను కేటాయించడాన్ని నిరసిస్తూ సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఉదయ్, రాఖి, ఉమేశ్, ఉదయ్, కల్యాణ్, సాయి పాల్గొన్నారు

'నిరుపేదలను నిండా ముంచిన బడ్జెట్'

మాట్లాడుతున్న హుస్సేన్

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుపేదలను నిండా ముంచిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్ విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని అమరవరం గ్రామంలో వ్యవసాయ కూలీలతో కలిసి కేంద్ర బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేనె సీతారాములు, షేక్ సైదా, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

గురుకుల దరఖాస్తు గడువు పొడిగింపు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 2: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో చేరేందుకు దరఖాస్తు గడువును ఈ నెల 6వ తేదీ వరకు పొడిగించినట్లు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తిరుమలగిరి, ఫిబ్రవరి 2: తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధి నందాపురం గ్రామంలోని బిక్కేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేశారు.

బైక్ దొంగ అరెస్ట్

నాగారం, ఫిబ్రవరి 2: గతేడాది నవంబర్ 9న నాగారం మండల కేంద్రానికి చెందిన ఓర్సు అశోక్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీకి గురికాగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు బైక్‌ను దొంగతనం చేసిన సూర్యాపేటకు చెందిన అబ్బగాని శ్రీమాన్‌ను ఆదివారం అరెస్ట్ చేశారు. బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు.

'నీటి సరఫరాలో అంతరాయానికి చర్యలు'

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 2: వేసవిలో నీటి సరఫరాలో అంతరాయాన్ని నివారించేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో పది రోజుల ప్రత్యేక పరిశీలన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1 నుంచి 12వ తేదీ వరకు జరిగే నీటి సరఫరా పరిశీలన కార్యక్రమాల్లో నీటి సరఫరా అనుబంధ శాఖల ఏఈలు, డీఈలు, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. గ్రామాల్లో నీటి సరఫరాల్లో అంతరాయం ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నూతన కమిటీ బాధ్యులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 2: నేరేడుచర్ల, పాల కవీడు మండలాల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా దేవులపల్లి జనార్ధనాచారి, ప్రధాన కార్యదర్శిగా వజ్రాల లింగాచారి, కోశాధికారిగా మడూరి కృష్ణమా చారిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సూరోజు సీతారాములు, ఆకారపు వెంకటేశ్వర్లు, తునికిపాటి జగన్నాథచారి, వెంకటేశ్వర్లు, ఉరుమెళ్ల రామ్మూర్తి, బొడ్డుపల్లి సుందరయ్య, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణికి సకాలంలో హాజరుకావాలి'

నూతనకల్, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు వారి సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

నీటి టబ్‌లో పడి చిన్నారి మృతి

పాలకవీడు, ఫిబ్రవరి 2: మండలంలోని హన్మయ్యగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాబోజీ తండాలో విషాదం చోటుచేసుకుంది. నీటి టబ్‌లో పడి నవనీత (18 నెలలు) అనే చిన్నారి మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం.. బాబోజీ తండాకు చెందిన బాణోతు కృష్ణ హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కృష్ణకు ఉద్యోగ పరమైన ట్రైనింగ్ ఉండడంతో భార్య శిరీష, కుమార్తె నవనీతను స్వగ్రామానికి పంపాడు. ఆదివారం శిరీష ఇంట్లో పనిచేసుకుంటుండగా నవనీత ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలోని నీటి టబ్‌లో పడి ఊపిరాడక చనిపోయింది. పని ముగించుకున్న శిరీష కుమార్తెను వెతకగా టబ్‌లో మృతిచెంది కనిపించింది. కాగా, ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అఘోరి హల్‌చల్

- తల్వార్‌తో యువకులపై దాడికి యత్నం

అమరావతి హోటల్ వద్ద యువకుడితో గొడవ పడుతున్న అఘోరి

చివ్వెంల, ఫిబ్రవరి 2: మండలంలోని ఉండ్రుగొండ గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఓ అఘోరి హల్‌చల్ చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండ్రుగొండకు చెందిన కొందరు యువకులు సూర్యాపేటలో ఓ వివాహ వేడుకకు హాజరై రాత్రి తిరిగి గ్రామానికి బయలుదేరారు. గ్రామ శివారులోని ఎర్రచెర్వు కట్టపై గ్రామానికి వెళ్లే దారిలో ఓ అఘోరి కారు ఆపుకొని ఉండడంతో యువకులు తమ బైక్‌లను పక్కన నిలిపి అఘోరి దగ్గరకు వెళ్లి ఫొటోలు తీయడానికి ప్రయత్నించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అఘోరి ఒక్కసారిగా వారిపై దాడికి దిగింది. దీంతో యువకులు ఓ కర్ర తీసుకొని బెదిరించడానికి ప్రయత్నించగా తన కారులో ఉన్న తల్వార్(కత్తి) బయటకు తీసి యువకులపైకి వెళ్లడంతో వారు గ్రామంలోకి పరుగులు తీశారు. గ్రామంలోకి వెళ్లిన అఘోరి సుమారు రెండు గంటలపాటు విపస్మగా తిరుగుతూ తనపై దాడికి పాల్పడిన వారితో క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేసింది. పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని అఘోరికి నచ్చజెప్పడంతో సూర్యాపేట వైపు వెళ్లి ఖాసింపేట గ్రామం వద్ద విశ్రాంతి తీసుకుంది. ఆ తర్వాత ఆదివారం ఉదయం జగన్ నాయక్ తండా శివారులోని అమరావతి హోటల్ వద్ద అఘోరి టిఫిన్ చేస్తుండగా ఓ యువకుడు సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నించడంతో అతడిపై కూడా దాడికి పాల్పడింది. హోటల్ సిబ్బంది, స్థానికులు నచ్చజెప్పినప్పటికీ వినకుండా తన కారును కోదాడ-సూర్యాపేట రహదారిపై అడ్డుగా పెట్టి కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అఘోరికి నచ్చజెప్పారు. తాను విజయవాడకు వెళ్లాలని తెలపడంతో పోలీసులు మునగాల పరిధి వరకు ఎస్కార్ట్ కల్పించారు. కాగా, అఘోరి వాహనంలో తల్వార్లతో పాటు మద్యం ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

'విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ పోరాటం'

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 2: విద్యారంగ బలోపేతం కోసం, సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 4, 5 తేదీల్లో భద్రాచలం పట్టణంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని ఈ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలో కౌన్సిల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి ఏ మాత్రం కృషి చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్న స్థితిని ముఖ్యమంత్రి గుర్తించాలని సూచించారు. రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో విద్యార్థుల సమస్యలపై చర్చించి విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళిక రూపకల్పన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సూరం విజయ్, రవి, యశ్వంతి, శ్రీజ, పల్లవి, తేజస్విని, గీతిక, రమ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

- తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్

ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా కార్యవర్గం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 2: నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా తెలంగాణ చేనేత ఐక్య వేదిక ఏర్పడిందని రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన చేనేత ఐక్య వేదిక జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. చేనేతల సమస్యలపై ఇటీవల సీఎం, మంత్రులను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కాగా, జిల్లా అధ్యక్షుడిగా చిలువేరు నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా భీమన పల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా యెల్లె లక్